క్లుప్తంగా

నేటి నుంచి లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



ఉత్సవాల్లో నేపథ్యంలో కొండపై ఏర్పాటు చేసిన రంగుల రాట్నాలు



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ అధికారులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. 25వ తేదీ సాయంత్రం 6గంటలకు నిర్వహించే విశ్వక్సేన ఆరాధనతో బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి.26వ తేదీ మధ్యాహ్నం 12గంటలకు స్వామి అమ్మవార్ల కల్యాణం ,27వ తేదీ సాయంత్రం 4గంటలకు స్వామివారి పల్లకీసేవ, గ్రామోత్సవం ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో మార్కండేయస్వామి జయంతి



జగద్గిరిగుట్ట: మార్కండేయస్వామి జయంతిని పురస్కరించుకుని మంగళవారం జగద్గిరిగుట్ట కొండపై ఉన్న శ్రీశివ పంచాయతన సహిత మార్కండేయస్వామి ఆలయం, గాజుల రామారం డివిజన్ పరిధి శ్రీరామ్‌నగర్‌లోని శివ మార్కండేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యావాచనం, అభిషేకం, అఖండ దీపారాధన, మధ్యాహ్నం భజనలు, కోలాట, అన్నదానం, సాయంత్రం స్వామివారి ఊరేగింపు కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



వైఎస్ షర్మిలను కలిసిన సాతాల గోపాల్

కుత్బుల్లాపూర్: విదేశీ పర్యటన ముగించుకుని నగరానికి చేరుకున్న వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలను మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సాతాల గోపాల్ ఆధ్వర్యంలో కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. లోటస్ పాండ్‌లో షర్మిలను కలిసిన గోపాల్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న పరిస్థితులను వివరించినట్లు తెలిపారు. 2023 ఎన్నికల్లో తప్పనిసరిగా కుత్బుల్లాపూర్‌లో మెజార్టీ సాధించాలన్నారు. అందుకు తగ్గట్టుగా ప్రజా సమస్యలపై ఇంటింటికి తిరిగి పాదయాత్రలు చేయాలని చెప్పినట్లు గోపాల్ తెలిపారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు షర్మిలను కలిసిన వారిలో ఉన్నారు.

మండప నిర్మాణానికి రూ.లక్ష విరాళం

నిజాంపేట్: కార్పొరేషన్ 28వ డివిజన్ పరిధిలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ కల్యాణ మండపం నిర్మాణానికి మంగళవారం కొలన్ జంగారెడ్డి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. సదరు మొత్తాన్ని ఆలయ చైర్మన్, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయండి

సుభాష్‌నగర్: రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సీపీఐ నాయకులు మంగళవారం జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఉమామహేశ్, నాయకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ రావినారాయణరెడ్డినగర్‌లో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని డిప్యూటీ కమిషనర్, ఎమ్మెల్యే, జోనల్‌కమిషనర్, మేడ్చల్ కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదన్నారు. కనీసం జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయ అధికారులైనా స్పందించి రోడ్లను బాగు చేయాలని కోరారు. కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. సమస్య తీర్చకుంటే వినతి పత్రాలతో ప్రజావాణ్యం వేస్తామని సీపీఐ నాయకులు స్పష్టం చేశారు.

1765 మందికి కంటి పరీక్షలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా కంటి వెలుగు పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఒక్క రోజే 1765 మందికి కంటి పరీక్షలు చేశారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని గాంధీనగర్ కమ్యూనిటీ హాలు,సూరారం కాలనీ లాయిన్ బ్రెయిలీ కమ్యూనిటీ హాలు, సుభాష్‌నగర్ బస్తీ దవాఖానా,పద్మానగర్ కమ్యూనిటీ హాలు,దుర్గా ఎస్టేట్స్ కమ్యూనిటీ హాల్‌లో 671 మందికి కంటి పరీక్షలు చేశారు.అదే విధంగా గాజులరామారం సర్కిల్ పరిధిలోని 530 మందిని, నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల పరిధిలో 564మందిని పరీక్షించి కళ్లద్దాలు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

ఆయా రామ్.. గయారామ్

ఇదీ వైద్యారోగ్య అధికారి పోస్టు పరిస్థితి!

- పది రోజులు కాకముందే అధికారిపై ఆరోపణలు
- ఏడాదిలో ఏడుగురు అధికారులు మారడం గమనార్హం



కుత్బుల్లాపూర్: పారిశుద్ధ్య విభాగం పనులు చూసే వైద్య ఆరోగ్య అధికారి సీటు ఎవరికి అచ్చొస్తలేదు. పట్టుమని పది రోజులు కాకముందే ఆరోపణలు రావడం. వెళ్లిపోవడం పరిపాటిగా మారింది. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో పనిచేసే వైద్య ఆరోగ్య అధికారి పోస్టు ×ఆయా రామ్.. గయారామ్‌×అన్నట్లుగా మారింది. దీంతో ఈ విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం పని చేస్తున్న రామ్‌రెడ్డిని ఇక్కడి నుంచి తప్పించాలని ఉన్నతాధికారులకు నివేదికలు వెళ్లడంతో తదుపరి వైద్య అధికారి ఎవరు అన్నది ఆసక్తికరంగా మారింది.

◆ 2021 నుంచి ఇక్కడ పనిచేస్తున్న అధికారులు నెలా.. రెండు నెలలు తిరగకముందే ఏదైనా ఆరోపణలు రావడం వెంటనే తప్పించడం జరుగుతూ వస్తుంది. ఇలా ఏకంగా సంవత్సరకాలం తిరగక ముందే ఏడుగురు అధికారులు మారడం విశేషం. మహిపాల్‌రెడ్డి అనంతరం సంపత్‌కుమార్, భానుచందర్, ప్రమీల, ఇన్‌చార్జ్‌గా వ్యవహరించిన ప్రశాంతి, అనంతరం వచ్చిన చంద్రశేఖర్‌రెడ్డి తాజాగా బాధ్యతలు తీసుకుని మూడు నెలలు గడవకముందే రామ్‌రెడ్డి మాకు వద్దంటూ.. ఉన్నతాధికారులకు నివేదిక పంపడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

వాస్తు దోషం అంటూ పుకార్లు....

కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో పనిచేసే వైద్య ఆరోగ్య అధికారులు నెల.. రెండు నెలలు.. మూడు నెలలు.. ఇలా పని చేసి ఏదైనా ఆరోపణలు ఎదుర్కొని వెళ్లడం జరుగుతూ ఉండటం మూలంగా ప్రస్తుతం కార్యాలయంలో ఉన్న ఆ అధికారి గది వాస్తు బాగాలేదని అందుకే వచ్చిన అధికారులు నిలకడ లేకుండా ఆరోపణలు వచ్చి వెళ్లిపోతున్నారని పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

◆ మొత్తం నాలుగు డివిజన్‌లలో పనిచేసే పారిశుద్ధ్య విభాగం పనులతో పాటు ఇతర ట్రేడ్ లైసెన్స్ విషయంపై వైద్య ఆరోగ్య అధికారులు దృష్టి సారిస్తారు. అయితే ఇక్కడికి వస్తున్న అధికారులు వెంటనే వెళ్లిపోవడం స్థానికంగా పట్టు అనేది లేకుండా పోతుంది. శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ లుగా పనిచేసే కొంతమంది పని కట్టుకుని వైద్య ఆరోగ్య అధికారులపై లేనిపోని చాడీలు చెప్పి అధికారుల మధ్య గొడవలు సృష్టించడం.. తదనంతరం అధికారిని బ్లాక్ మెయిల్ చేయడం జరుగుతూ వస్తుందని ఇక్కడ పనిచేసి వెళ్లిన ఓ వైద్య ఆరోగ్య అధికారి పేర్కొనడం విశేషం.

వాస్తు దోషం ఏమీ లేదు...



కార్యాలయంలో కూర్చుని పని చేస్తే కాదు. ఫీల్డ్‌లో తిరిగే అధికారి వాస్తు దోషాలు పట్టించుకోరు. ఆరోపణలు వచ్చే అధికారులపై తప్పకుండా చర్యలు ఉంటాయి. ప్రస్తుతం పనిచేస్తున్న రామ్‌రెడ్డి విషయంపై నివేదిక అందజేశాం. ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారు. ప్రస్తుతం ఎవరు కొత్తగా రాలేదు. పారిశుద్ధ్య పనుల విషయంపై ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా తనిఖీలు చేపడుతూ ముందుకు సాగుతున్నాం. – మంగతాయారు, ఉప కమిషనర్, కుత్బుల్లాపూర్

అమ్మవారికి కుంకుమార్చన.. బోనాల సమర్పణ



కుంకుమార్చనల అనంతరం పసుపు బొట్టు ఇచ్చుకుంటున్న మహిళలు

సుభాష్‌నగర్: గాజులరామారంలోని చిత్తారమ్మ దేవి జాతరలో భాగంగా మంగళవారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం కుంకుమార్చనను నిర్వహించారు. ఈనెల 26 వరకు కుంకుమార్చన కార్యక్రమం జరుగుతుందని ఆలయ చైర్మన్ కూన అంతయగౌడ్ తెలిపారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆలయ ఆవరణలో వెలిసిన షాపులు భక్తులతో కిటకిటలాడాయి.

నాయీ బ్రాహ్మణులకు అండగా ఉంటాం

దుండిగల్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతికి కృషి చేశామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. సూరారం నాయీ బ్రాహ్మణ నూతన కమిటీ సభ్యులు మంగళవారం భౌరంపేట్‌లోని కార్యాలయంలో భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ కమిటీ సభ్యులను ఆయన సత్కరించి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్షుడు పల్నాటి శివకుమార్ నాయీ, వైస్ ప్రెసిడెంట్ నరేశ్ నాయీ , జనరల్ సెక్రటరీ బాలవీర్ వెంకటేష్ నాయీ, ప్రవీణ్ నాయీ, సత్యనారాయణ నాయీ , మధు నాయీ, కేశవనాయీ, మహేశ్ నాయీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సమాన హక్కులు కల్పించడానికి కృషి

పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్య

రంగారెడ్డినగర్: స్త్రీలపై జరుగుతున్న పితృస్వామిక అణచివేత, శ్రమ దోపిడీలపై నాలుగు దశాబ్దాలుగా పీవోడబ్ల్యూ పోరాడుతోందని ఈ సంస్థ జాతీయ కన్వీనర్ సంధ్య అన్నారు. మంగళవారం సూరారం కాలనీ డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌లో జరిగిన పీవోడబ్ల్యూ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల రెండో మహాసభలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

◆ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలకు పైగా స్త్రీ, పురుష సమానత్వం, అన్ని రంగాలలో సమభాగస్వామ్యంపై పీవోడబ్ల్యూ పోరాడుతోందన్నారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి రాష్ట్రంలో బలమైన మహిళా సంఘంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. మహిళలకు సమాన హక్కులు కల్పించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. మహిళా వ్యతిరేక విధానాలు, మహిళలపై పెరుగుతున్న లైంగిక హింస, సాగుతున్న దాడులను వ్యతిరేకించాలని ఆమె పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో జరిగే మహాసభలకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

◆ ఐఎఫ్‌టీయూ నాయకురాలు అనురాధ మాట్లాడుతూ... మహిళలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక సమానత్వం, నివాస హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బీడీ కార్మికులుగా, గృహ కార్మికులుగా పనిచేస్తున్న మహిళల కోసం ఎన్నో పోరాటాలు చేసి చట్టాలు, హక్కులు సాధించుకున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ నగర కార్యనిర్వాహణ అధ్యక్షురాలిగా ఎం.సరళ, ఉపాధ్యక్షులుగా జి.పద్మ, భండారువిజయ, ప్రధాన కార్యదర్శిగా జి.భారతి, సహాయ కార్యదర్శిగా వి.జయసుధ, ఎం.అనిత కోశాధికారిగా పుణ్యవతితో పాటు మొత్తం 23 మంది ఎన్నుకున్నారు.

వార్డు సమస్యలను పరిష్కరించాలి

దుండిగల్: మల్లంపేట్ 26వ వార్డుకు చెందిన కేపీఆర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం శంభీపూర్ కృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతంలో నెలకొన్న డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కాలనీ సభ్యులు రాన జోగారావు, సుజాత, సందీప్‌రెడ్డి, కార్తిక్, వినోద్, షరీఫ్, సాయి తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజలు

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మంగళవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు ఎమ్మెల్సీని కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

సీవరేజీ నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం



రాజీవ్‌గృహకల్ప బ్లాక్ నం.13లో పారుతున్న మురుగు

జగద్గిరిగుట్ట: సీవరేజీ నిర్వహణ విషయంలో జల మండలి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్‌గృహకల్ప బ్లాక్ నం.13వ రోడ్డుపై రెండు రోజులుగా డ్రైనేజీ నీరు ఏరులై పారుతోంది. దీంతో రోడ్డంతా చిత్తడిగా మారి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసి డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లక్షణాలుంటే కోవిడ్ పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 16 మందికి పరీక్షలు చేయగా అందరికి నెగిటీవ్ రిపోర్ట్‌లు వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఎవరైనా జ్వరం, దగ్గు, గొంతు నొప్పి లక్షణాలతో ఇబ్బందులు పడుతుంటే వెంటనే కోవిడ్ పరీక్ష చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ధన్‌రాజ్‌యాదవ్

నిజాంపేట్: మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసి ముందుకు సాగుతున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ 28వ డివిజన్‌లోని వజ్రప్రతీక్ వద్ద రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, డీఈ దాసయ్య, ఇంజినీర్ అరుణ్, కాంట్రాక్టర్ రాజేష్ తదితరులు ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటేనే రాణిస్తాం

- అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ హెడ్ జె.వెంకట్
- సమన్వయ్ మేనేజ్‌మెంట్ ఫెస్ట్ షురూ



సమన్వయ్‌కు హాజరైన శివశివాని విద్యాసంస్థల ప్రెసిడెంట్ ఆర్తీ సంపతి, వైస్ ప్రెసిడెంట్ శైలేష్ సంపతి, అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ హెడ్ వెంకట్






విద్యార్థుల నృత్య ప్రదర్శన

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శివశివాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో రెండు రోజుల పాటు జరుగనున్న 24వ సమన్వయ్ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. శివశివాని విద్యా సంస్థ ప్రెసిడెంట్ ఆర్తీ సంపతి అధ్యక్షతన జరిగిన సమన్వయ్ మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌కు అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ పీపుల్ డెవలప్‌మెంట్ హెడ్ జె.వెంకట్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఎలక్ట్రిక్ బైక్, సర్తాజ్ ఆఫ్ సమన్వయ్ ట్రోఫీని ఆవిష్కరించారు.

◆ అనంతరం వెంకట్ మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నప్పుడే మనం ఉన్నతస్థాయికి చేరుకోగలుగుతామన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. అదే మన ప్రగతికి దోహద పడుతుందని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు కళాశాలలకు చెందిన 1500 మంది విద్యార్థులు సమన్వయ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మొదటి రోజు విద్యార్థులకు ఇన్‌ఫార్మల్ ఈవెంట్స్ నిర్వహించారు.

◆ ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శైలేష్ సంపతి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ దీపికా సంపతి, డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీ రమణారావు, సమన్వయ్ కో-ఆర్డినేటర్‌లు తిరుమల్‌రెడ్డి, చైతన్య, బాలాంజిరెడ్డి, స్టూడెంట్స్ కో-ఆర్డినేటర్లు హేమంత్‌రెడ్డి, సాంసన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెల్లాని రూపం.. విరిసే పుష్పం



గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడ నుంచి ఓక్షిత ఎన్‌క్లేవ్‌కు వెళ్లే రోడ్డులోని ఓ వెంచర్‌లో ఉన్న చెట్టు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. చెట్టుకు ఒక్క ఆకు కూడా లేకుండా మొత్తం తెల్లటి పూలతో విరబూసి అటుగా వెళ్లే వారిని ఆకట్టుకుంటోంది. – సుభాష్‌నగర్

క్రైం కార్నర్..

ఎస్కార్ట్‌ను పెట్టుకుని గంజాయి తరలింపు

- 150 కిలోల గంజాయి స్వాధీనం
- నలుగురి రిమాండ్



గంజాయి ప్యాకెట్లను సీజ్ చేస్తున్న పోలీసులు



హోండా సిటీ కారులో పట్టుబడ్డ గంజాయి

దుండిగల్: అక్రమంగా 150కిలోల గంజాయిని తరలిస్తున్న నలుగురిని దుండిగల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలం టౌన్ నుంచి నగరానికి దుండిగల్ ఔటర్‌రింగ్ రోడ్డు ఎగ్జిట్-5 గుండా పెద్ద మొత్తంలో గంజాయి రవాణా చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో దుండిగల్ గ్రామంలోని రోటరీ-1 వద్ద దుండిగల్, శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెకింగ్ చేపట్టారు. ఈ క్రమంలో ఎస్ఎక్స్-4 మారుతి వాహనాన్ని ఆపి అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు లునవత్ నగేష్(30), సునావత్ వెంకటేష్(24)లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వెనుక వస్తున్న హోండా సిటీ వాహనంలో 150 కిలోల గంజాయిని తరలిస్తున్నామని తెలిపారు.

◆ తాము సదరు వాహనానికి ఎస్కార్ట్‌గా ఉన్నామని ఒప్పుకున్నారు. మరో 10 నిముషాల తరువాత అటుగా వచ్చిన హోండా సిటీ కారును ఆపి చెక్ చేయగా 150 కిలోల గంజాయి పట్టుబడింది. మొత్తం 75 బ్యాగ్‌లతో 2 కిలోల చొప్పున గంజాయిని ప్యాక్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో బానోత్ చందర్(32), గందు అజయ్(21)లను విచారించగా మహారాష్ట్రలోని తుల్జాపూర్‌కు తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో వారి నుంచి రెండు కార్లు, నాలుగు మొబైల్ ఫోన్లు, రూ.9వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపారు. దుండగులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన దుండిగల్ సీఐ రమణారెడ్డి, డీఐ కృష్ణప్రసాద్, శంషాబాద్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని బాలానగర్ డీసీపీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జీడిమెట్ల: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి వాటర్ ట్యాంకర్‌కు ఢీకొట్టగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఈ ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహెచ్ఈఎల్ ఆర్‌సీపురానికి చెందిన లక్ష్మీనారాయణ(22), ఓంకార్(21) ఇద్దరు స్నేహితులు. కాగా వీరిద్దరు సోమవారం రాత్రి సూరారంలో ఉంటున్న స్నేహితులకు కలిసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చారు. రాత్రి 10గంటల ప్రాంతంలో తిరిగి వెళ్తున్న క్రమంలో జీడిమెట్లలోని మైలాన్ పరిశ్రమ ఎదుట వాటర్‌ట్యాంకర్ ఎలాంటి ఇండికేషన్ ఇవ్వకుండానే యూటర్న్ తీసుకుంటోంది. దీంతో ద్విచక్ర వాహనంపై అదుపుతప్పి లారీ వెనుకవైపు ఢీకొట్టారు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు వాటర్‌ట్యాంకర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కన్వర్జన్స్ వార్షిక సాంకేతికోత్సవం



వీఎన్ఆర్ వీజేఐటీలో కన్వర్జెన్స్ 2కే23 కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



టెక్నికల్ ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (వీఎన్ఆర్ వీజేఐఈటీ) కళాశాలలో మంగళవారం కన్వర్జెన్స్ 2కే23 పేరిట 23వ వార్షిక సాంకేతికోత్సవం ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు కొనసాగే ఈ టెక్‌ఫెస్ట్‌ను రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ ప్రత్యేకాధికారి, ఎమర్జింగ్ టెక్నాలజీ సంచాలకులు లంకా రమాదేవి ముఖ్యఅతిథిగా హాజరై 2కే23 సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

భారత్‌ను నవకల్పన సూచీలో ముందుంచాలి..

◆ ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ... భారతదేశం రాబోయే రోజుల్లో ప్రబలశక్తిగా అవతరించనుందన్నారు. విద్యార్థులు సాంకేతిక సమస్యలపై దృష్టి సారించి కృత్రిమ మేధను ఉపయోగించి నవీన సాంకేతికతలకు ప్రతిభావంతమైన పరిష్కార మార్గాలు చూపాలన్నారు. భారతదేశాన్ని నవకల్పన సూచీలో ప్రపంచస్థాయిలో ముందంజలో ఉంచాలని సూచించారు. టాస్క్, టీ-హబ్, వీ-హబ్, టీ-వర్క్స్, రిచ్ వంటి సంస్థల ద్వారా సృజనాత్మకమైన ఆవిష్కరణలకు సహకరిస్తున్నామని పేర్కొన్నారు.

అధునాతన సాంకేతికతపై దృష్టి సారించాలి..

◆ విజ్ఞానజ్యోతి సంస్థ ఉపాధ్యక్షుడు కోడె దుర్గప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక మాంద్యం నేపథ్యంలో సాంకేతిక రంగంలో సింహభాగం ఉన్న భారతీయులే ఎక్కువగా ఉద్యోగాలు కోల్పోతున్నారని అన్నారు.వృత్తిపరమైన ఏదైనా ప్రత్యేకత లేకపోతే ఉద్యోగాన్ని నిలుపుకోవడం కష్టతరమని పేర్కొన్నారు. చాట్ జీపీటీ, అన్‌రియల్ ఇంజిన్ వంటి అధునాతన సాంకేతికతపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు.

◆ ఈఫెస్ట్‌లో 20 కళాశాలలకు చెందిన 2100 మంది విద్యార్థులు పాల్గొన్నారని విద్యార్థి పురోగతి డీన్ డాక్టర్ పద్మశాయి తెలిపారు. ఈ టెక్ ఫెస్ట్‌లో ప్రాజెక్ట్ కంటెస్ట్, రోబోటిక్స్, సాంకేతిక పత్రాల సమర్పణ తదితర పోటీలతో పాటు వినోదాత్మక అంశాలలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ సీడీ నాయుడు, సంచాలకులు డాక్టర్ బి.చెన్నకేశవరావు, కళాశాల ప్రధాన కార్యదర్శి జె.ఎస్.రావు, సంయుక్త కార్యదర్శి అచ్యుతరామప్రసాద్, భారత్ సోకాగె క్యాయ్ సంస్థ ప్రతినిధి డాక్టర్ మోనికా నాగ్‌పాల్ ప్రసంగించారు.